

# విరిగిన తలుపే కాపాడింది!

**కళ్ల ముందే పలువురు మరణించారు • మరణం తథ్యమని భావించాను**

**గ్రౌండ్ ఫ్లోర్‌పై కూలడం నా అదృష్టం • మృత్యుంజయుడు రమేశ్ మనోగతం**

అహ్మదాబాద్, జూన్ 13: అదృష్టంతో పాటు సకాలంలో వేగంగా నిర్ణయం తీసుకోవడం వల్లే తాను ప్రాణాలతో బయటపడగలిగానని అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాదంలో మృత్యుంజయుడిగానిలిచిన 40 ఏండ్ల ప్రవాస భారతీయుడు, బ్రిటిష్ వ్యాపారి విశ్వాస్‌కుమార్ రమేశ్ తెలిపారు. అహ్మదాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న రమేశ్ శుక్రవారం డీడీ న్యూస్‌తో మాట్లాడుతూ తాను ఎదుర్కొన్న భయానక అనుభవాన్ని వివరించారు. "విమానంలోని ఎడమ వైపున ఎమర్జెన్సీ డోరుకు అత్యంత సమీపంలో నేను కూర్చున్న 11ఏ సీటు ఉంది. గురువారం మధ్యాహ్నం సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొన్ని క్షణాల్లోనే బీజే మెడికల్ కాలేజీ సముదాయంలో భాగమైన హాస్టల్ భవనంపై విమానం కూలిపోయింది. అదృష్టవశాత్తు నేను కూర్చున్న సీటు భాగం హాస్టల్ ప్రాంగణం గ్రౌండ్ ఫ్లోర్‌పైన పడింది. విమానం డోరు పగిలిపోవడాన్ని చూశాక ఒకసారి ప్రయత్నించి బయటపడవచ్చని అనుకున్నాను. అనుకున్న వెంటనే విమానం నుంచి బయటపడ్డాను' అని రమేశ్ తెలిపారు.

### అంతా క్షణాల్లోనే

'నా కళ్ల ముందే అంతా క్షణాలలో జరిగిపోయింది. నేను ఎలా బతికానో నేనే నమ్మలేకపోతున్నాను. కొన్ని క్షణాలపాటు నేను చనిపోతున్నానని భావించాను. కళ్లు తెరిచి చూస్తే బతికే ఉన్నాను. సీటు బెల్టును అన్‌లాక్ చేసుకుని విరిగిపోయిన తలుపు కంతలో నుంచి బయటపడ్డాను' అని రమేశ్ వివరించారు. విమానంలోని ఇతర ప్రయాణికులు బయటపడలేకపోవడానికి కారణం అటువైపు హాస్టల్ గోడ ఉండడమేనని ఆయన చెప్పారు.

## ఎలా బతికానో నాకే తెలీదు

తాను కూర్చున్న సీటు దగ్గర ఒక చిన్న కంత ఏర్పడిందని రమేశ్ తెలిపారు. తన కళ్ల ముందే అనేకమంది ప్రాణాలు కోల్పోవడాన్ని చూశానని, తాను ఎలా బతికానో ఇప్పటికీ తాను నమ్మలేకపోతున్నానని రమేశ్ చెప్పారు. లండన్‌కు 140 కిలోమీటర్ల దూరంలోని లీసెస్టర్ నగరంలో నివసిస్తున్న రమేశ్ సొంతూరు గుజరాత్ పొరుగున ఉన్న కోస్తా పట్టణం డయ్యూ. చికిత్స పొందుతున్న రమేశ్‌ని శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ దవాఖానలో పరామర్శించారు. తాను ప్రమాదం నుంచి బయటపడినా తన ఎడమ చేయి మంటల్లో కాలిందని పేర్కొన్నారు. విమానం నుంచి నడుచుకుంటూ బయటకు వచ్చిన తాను ఎదురుగా కనిపించిన అంబులెన్సులో కూర్చుని దవాఖానకు వచ్చానని రమేశ్ తెలిపారు.



## విమాన ప్రమాదంపై దర్యాప్తు ప్రారంభం

*అహ్మదాబాద్‌లో గురువారం జరిగిన విమాన ప్రమాదంపై నగర పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ప్రమాదం వల్ల 265 మంది మరణించినట్లు పేర్కొన్నారు. ఈ సంఘటనపై ఇప్పటికే ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తును ప్రారంభించింది.*

అహ్మదాబాద్: మేఘానీ నగర్‌లోని ప్రమాద స్థలాన్ని ఎన్ఐఏ, ఇతర కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ విమానంలో 230 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో ఒకరు మాత్రమే మృత్యుంజయుడిగా బయటపడ్డారు. మిగిలిన మృతుల్లో ఎంబీబీఎస్ విద్యార్థులు, రెసిడెంట్ డాక్టర్లు ఉన్నారు. డిప్యూటీ చీఫ్ ఫైర్ ఆఫీసర్ ధ్రుమిత్ గాంధీ శుక్రవారం మాట్లాడుతూ, గాలింపు, సహాయ కార్యక్రమాలు ఉదయం ముగిసినట్లు తెలిపారు. ప్రమాద స్థలాన్ని ఫోరెన్సిక్ నిపుణులు, పౌర విమానయాన శాఖ అధికారులకు అప్పగించామన్నారు.

# నాన్నా.. ఉద్యోగం మానేసి నిన్ను చూసుకుంటా



**పైలట్ సుమీత్ తన తండ్రితో అన్న చివరి మాట • కుందర్ మరణం గురించి తెలియని తల్లిదండ్రులు**



కెప్టెన్ సుమీత్ సబర్వాల్

న్యూఢిల్లీ, జూన్ 13: ఒకరు విశేష అనుభవాన్ని సంపాదించుకుని ఇక త్వరలోనే రిటైర్ అవ్వాలని భావిస్తున్న సీనియర్ పైలట్. మరొకరేమో పౌర విమానయాన కెరీర్‌లో అద్భుతాలు సృష్టించాలని ఎన్నో కలలతో అదే రంగాన్ని ఎంచుకున్న జూనియర్ పైలట్. వారే కెప్టెన్ సుమీత్ సబర్వాల్, ఫస్ట్ ఆఫీసర్ క్లైవ్ కుందర్. గురువారం అహ్మదాబాద్‌లో ఎయిరిండియాకు చెందిన బోయింగ్ 787-8 డ్రీమ్‌లైనర్ ప్రమాదంలో అసువులు బాసిన వారిలో ఈ ఇద్దరు పైలట్లు ఉన్నారు. లండన్‌లోని గాట్విక్ విమానాశ్రయానికి 230 మంది ప్రయాణికులు, 10 మంది సిబ్బందితో బయలేదేరిన విమానాన్ని వీరిద్దరే నడుపుతున్నారు. వీరిద్దరికీ కలిపి 9,300 గంటల విమానం నడిపిన అనుభవం ఉంది. సబర్వాల్ ఒక్కరికే 8,200 గంటల అనుభవం ఉంది. వృత్తిపరమైన నిబద్ధతగల వ్యక్తిగా, ఎప్పుడూ ప్రశాంతంగా అందరితో కలుపుగోలుగా ఉండే వ్యక్తిగా విమానయాన సర్కిల్‌లో పేరుపొందిన సుమీత్ సబర్వాల్‌ని అందరూ ఎంతో గౌరవంగా చూస్తారు. ముంబైలోని పోవై ప్రాంతంలో ఆయన నివాసం. సబర్వాల్ కుటుంబానికి విమానయాన రంగంతో సుదీర్ఘ అనుబంధం ఉంది. సుమీత్ తండ్రి డీజీసీఏ అధికారిగా పనిచేసి రిటైర్ అయ్యారు. ఆయన సమీప బంధువులలో ఇద్దరు పైలట్లుగా పనిచేస్తున్నారు. ప్రమాదం జరగడానికి కొన్ని రోజుల ముందే తాను పైలట్ ఉద్యోగానికి రాజీనామా చేయనున్నట్లు సుమీత్ అనారోగ్యంతో బాధపడుతున్న తన 82 ఏళ్ల తండ్రికి తెలియచేశారు. తన తండ్రి సంరక్షణా బాధ్యతలను ఇక పూర్తి కాలం చూసుకుంటానని కూడా ఆయన మాట ఇచ్చినట్లు శివసేన ఎమ్మెల్యే దిలీప్ లాండే చెప్పారు. సుమీత్ కుటుంబాన్ని ఆయన శుక్రవారం పరామర్శించారు.

### కుటుంబం అంతా విమానయాన రంగంలోనే..



**ఇక** కుందర్‌కు 1100 గంటల ఫ్లయింగ్ అనుభవం ఉంది. ఆయన కుటుంబంలో కూడా చాలా మంది విమానయాన రంగంలో ఉన్నారు. కుందర్ తల్లి విమాన సిబ్బంది సభ్యురాలిగా పనిచేశారు. ముంబైలోని జుహూలోగల బాంబే ఫ్లయింగ్ క్లబ్‌లో కుందర్ ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటేనన్స్ కోర్సు ప్రాథమికంగా పూర్తి చేశారు. ముంబైలోని కలీనాలోగల ఎయిరిండియా కాలనీలో పెరిగిన కుందర్ ఆ తర్వాత కుటుంబంతో కలసి బోరివలీకి మకాం మార్చారు. తన సోదరుడి మరణం గురించి తమకు పూర్తి సమాచారం అందలేదని, అతను క్షేమంగానే ఉన్నాడని భావిస్తున్నామని కుందర్ సోదరి క్లైన్ హిందుస్థాన్ టైమ్స్‌కి తెలిపారు ఆమె చెప్పారు. తన తండ్రి క్లిఫర్డ్, తల్లి రేఖ తనతోపాటే ఇప్పుడు సిడ్నీలో ఉన్నారని, కుందర్ యోగక్షేమాలు తెలుసుకోవడానికి తాము శుక్రవారం అహ్మదాబాద్ బయల్దేరుతున్నామని ఆమె పేర్కొన్నారు.



### కల తీరిందని సంతోషపడేలోపే..

**తన** కల నెరవేరందని సంతోషపడేలోపునే క్రూ మెంబర్ మైథిలీ పాటిల్ (22) ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించింది. నవీ ముంబయి కి చెందిన ఆమె చిన్నప్పటి నుంచి ఎయిర్ బ్యూటీ క్వీన్ కావాలని కలలు కనేది. ఆమె కలలు నిజమై ఆమె ఎయిరిండియా సిబ్బందిలో భాగమైంది. గురువారం విధి నిర్వహణలో ఉండగానే ఆమె ప్రమాదంలో కన్నుమూసింది.



### అదే ఆమె ఆఖరి కాల్

ఇంఫాల్: విమాన ప్రమాద మృతుల్లో మణిపూర్ తౌబల్ పట్టణానికి చెందిన 21 ఏండ్ల ఫ్లయిట్ అటెండెంట్ న్గంతోయ్ శర్మ ఉందని తెలిసి ఆమె కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. కొద్ది గంటల ముందే తమతో మాట్లాడిన ఆమె ఇక బతికి లేదన్న విషయం తెలిసి శోక సంద్రంలో మునిగిపోయారు. న్గంతోయ్ శర్మ గురువారం 11.30 గంటలకు కుటుంబ సభ్యులకు ఫోన్ చేసింది. తాను లండన్‌కు డ్యూటీపై వెళ్తున్నానని, కొద్ది రోజుల పాటు ఫోన్‌కు అం దుబాటులో ఉండనని, అక్కడి నుంచి జూన్ 15 తర్వాతే వస్తానని, అప్పుడే అందుబాటులో ఉంటానని తెలిపింది. అదే ఆమె ఆఖరి కాల్. మూడు గంటల తర్వాత ఆమె విమాన ప్రమాదంలో మృతి చెందినట్టు వార్తల్లో తెలుసుకుని కుటుంబం కుప్పకూలిపోయింది. కాలేజీలో చదువుతుండగానే 19 ఏండ్లకే ఎయిర్ ఇండియాలో శర్మకు ఉద్యోగం వచ్చిందని, ముంబైలో స్నేహితులతో హాస్టల్‌లో ఉంటున్నదని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.



### చెక్కు చెదరని భగవద్గీత!

ఎయిర్ ఇండియాకు విమానం దుర్ఘటనలో విమానం పూర్తిగా కాలిపోయినప్పటికీ హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీత చెక్కు చెదరని స్థితిలో లభించింది.



### వివాహం నిశ్చయం.. అంతలోనే విషాదం

**విమాన ప్రమాదంలో మృతిచెందిన రోషిణి ఉదంతం**

థాణె: వివాహం నిశ్చయం కావడంతో తన బిడ్డ ఇక సంతోషంగా కొత్త జీవితంలోకి అడుగుపెడుతుందనుకున్న వేళ విమాన ప్రమాదం ఆ ఇంట తీరని విషాదం నింపింది. మహారాష్ట్రలోని థాణె జిల్లా డోంబివిలి పట్టణంలోని రాజాజీ రోడ్డులో నివసించే రోషిణి సొంగారే(26) అహ్మదాబాద్‌లో గురువారం కూలిన ఎయిరిండియా విమానంలో సహాయకురాలిగా పనిచేస్తున్నది. తండ్రి రాజేంద్ర, తల్లి శోభ, సోదరుడు విఘ్నేశ్ ఉన్నారు. ఇటీవలే ఆమె వివాహం మర్చెంట్ నేవీ ఆఫీసర్‌తో నిశ్చయమైంది. నవంబర్‌లో నిశ్చితార్థం, మార్చిలో పెండ్లిని కుటుంబ సభ్యులు ఖాయం చేసుకున్నారు. లండన్ వెళ్లేందుకు మూడు రోజుల క్రితమే ఇంటి నుంచి వెళ్లి విధుల్లో చేరింది. విమాన ప్రమాదం గురించి తెలిసిన వెంటనే తమ కూతురు బతికే ఉంటుందనే ఆశతో కుటుంబసభ్యులు అహ్మదాబాద్ చేరుకున్నారు. కానీ వారికి నిరాశే ఎదురైంది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా కూడా రోషిణి ప్రతిభ చూపుతున్నది.



### లక్కీ నంబర్ 1206.. మరణం 12/06

**విజయ్ రూపానీకి కలిసిరాని లక్కీ నంబర్**



న్యూఢిల్లీ: ఎయిరిండియా విమాన దుర్ఘటనలో మృతి చెందిన గుజరాత్ మాజీ ముఖ్యమంత్రి విజయ్‌రూపానీ కూడా అదృష్ట సంఖ్యను నమ్ముతారు. 1206ను ఆయన తన లక్కీ నంబర్‌గా విశ్వసిస్తారు. ఆయన బైక్, కారు.. ఇలా వాహనమేదైనా ఆ నంబర్ ఉండాల్సిందే. ఆ సంఖ్య అంటే ఆయనకు అంత ఇష్టం. అయితే, కాకతాళీయమే అయినా అదే సంఖ్య ఆయన ఆయువును బలిగొన్నది. విమాన ప్రమాదం జూన్ 12న జరిగింది. అంటే.. 12/06. నిజానికి అది ఆయన లక్కీ నంబర్. కానీ, అదే రోజు ఆయన విమాన ప్రమాదంలో మరణించడం అందరినీ కలచివేసింది. పంజాబ్ బీజేపీ ఇన్‌చార్జిగా ఉన్న విజయ్ రూపానీ లండన్‌లో ఉన్న తన భార్య, కుమార్తెను కలిసేందుకు ఎయిరిండియా విమానమెక్కారు. నిజానికి ఆయన ఈ నెల 5 నుంచి 12 మధ్య లండన్‌లో పర్యటించాల్సి ఉన్నది. అయితే, లూధియానా వెస్ట్ ఉప ఎన్నిక కారణంగా దానిని వాయిదా వేసుకుని 12న ఆయన విమానమెక్కారు.

### లండన్ కోరిక తీరకుండానే..

**ఏఐ-171 విమాన ప్రమాదంలో అసువులుబాసిన నీరజ్, అపర్ణ**

**బామ్మతో ఉండిపోయిన కుమార్తె క్షేమం**

ఆగ్రా: నీరజ్ లవానియా (50), ఆయన సతీమణి అపర్ణ (49)లకు కొత్త ప్రదేశాలను సందర్శించడమంటే చాలా ఇష్టం. వేసవిలో వారు ఒక్కొక్క సారి ఒక్కొక్క చోటుకు వెళ్లి, ఆనందంగా గడుపుతారు. ఈసారి వీరిద్దరూ లండన్‌లో సరదాగా సేద తీరాలనుకున్నారు. అయితే, విధి వారిద్దరినీ కబళించింది. గురువారం జరిగిన ఏఐ-171 విమాన ప్రమాదంలో మరణించిన 241 మందిలో ఈ దంపతులు కూడా ఉన్నారు. వీరి కుమార్తె (18) చదువుకుంటున్నారు. ఆమె కూడా తల్లిదండ్రులతో కలిసి లండన్ వెళ్లవలసి ఉంది. కానీ ఆమె 70 ఏళ్ల వృద్ధురాలైన బామ్మ బాగోగులు చూడటం కోసం ఆమెతో కలిసి ఇంటి వద్దనే ఉండిపోయారు. దీంతో భయానక ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ప్రైవేట్ కంపెనీలో పనిచేసే నీరజ్ స్వస్థలం ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా. ఆయన 1995లో గుజరాత్‌లోని వడోదరకు వలస వెళ్లారు.ఈ దంపతుల మరణవార్త అందరినీ కలచి వేస్తున్నది.



**బర్త్‌డే వేడుకలు చేసుకుందామని...**

యూపీలోని ఆగ్రాకు చెందిన ఒక వ్యక్తి తన భార్య 50వ పుట్టిన రోజును లండన్‌లో జరుపుకోవాలని లండన్ బయలుదేరాడు. కొద్దిసేపటికే మృత్యుఒడికి చేరుకున్నారు.

### కుమారుడి గృహప్రవేశం కోసం బయల్దేరి!

**అసువులు బాసిన వృద్ధ దంపతులు**

అహ్మదాబాద్: యూకేలో కొత్తగా ఇంటిని కొనుక్కున్న కుమారుడి గృహ ప్రవేశానికి ఎంతో ఉత్సాహంగా బయలుదేరిన వృద్ధ దంపతుల ఆనందాన్ని అహ్మదాబాద్ విమాన ప్రమాదం చిదిమేసింది. పినాకిన్ షా (62), అతని భార్య రూపాబెన్ (58) అహ్మదాబాద్‌లో నివసిస్తున్నారు. వారి కుమారుడు రుషబ్ స్కాట్లాండ్‌లోని గ్లాస్గోలో ఇంటిని కొనుక్కుని గృహప్రవేశానికి ఆహ్వానించాడు. దాని కోసం వారు గురువారం విమానంలో వెళ్తుండగామరణించారు.



### భార్య చివరి కోరిక తీర్చేందుకు వచ్చి!

**భార్య అస్థికలు నర్మదానదిలో కలపడానికి వచ్చి దుర్మరణం.. అనాథలైన ఇద్దరు పిల్లలు**

అహ్మదాబాద్, జూన్ 13: భార్య అంతిమ కోరిక మేరకు ఆమె చితాభస్మాన్ని నర్మదా నదిలో కలపడానికి లండన్ నుంచి వచ్చిన ఇండో బ్రిటీషర్ అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో మరణించాడు. లండన్ కేంద్రంగా నివసిస్తున్న అర్జున్ మనుభాయ్ పటోలియా (36), భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి లండన్‌లో నివసిస్తున్నాడు. వారం రోజుల క్రితం అతని భార్య భారతీబెన్ కన్నుమూసింది. తన అస్థికలను మాతృభూమి భారత్‌లో కలపాలని ఆమె భర్తను చివరి కోరిక కోరింది. దీంతో అర్జున్ ఆమె చితాభస్మాన్ని పట్టుకుని గుజరాత్‌లోని అమ్రేలీ జిల్లాలోని తన పూర్వీకుల గ్రామం వడియాకు వచ్చి నర్మదా నదిలో నిమజ్జనం చేశాడు. అహ్మదాబాద్‌లో విమానం ఎక్కి లండన్ వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో మరణించాడు. వారం రోజుల వ్యవధిలోనే తల్లిదండ్రులు మరణించడంతో లండన్‌లో ఉన్న వారి 4, 8 ఏండ్ల కుమార్తెలు అనాథలుగా మారారు.

### నిద్రిస్తున్న టీ స్టాల్ బాలుడిపై పిడుగులా పడి..

అహ్మదాబాద్: ఆకాశంలో విహరించాల్సిన విమానం చెట్టుకింద పడుకున్న బాలుడి ప్రాణం తీయడమేంటి? విధి అంటే ఇదో కాబోలు అన్పిస్తుంది ఈ ఘటన గురించి తెలుసుకున్న వారికెవరికైనా. గురువారం జరిగిన ఘోర విమాన ప్రమాదంలో అహ్మదాబాద్ మేఘానినగర్ ప్రాంతంలో బీజే మెడికల్ కాలేజీ హాస్టల్ భవనం సమీపంలో తన తల్లిదండ్రుల టీ స్టాల్‌కు సమీపంలోని ఒక చెట్టుకింద నిద్రిస్తున్న 14 ఏండ్ల ఆకాశ్ పాట్నీని విమాన శకలం పొట్టనపెట్టుకుంది. ఈ టీస్టాల్ విమానం ఢీకొన్న హాస్టల్ భవనానికి ఆనుకుని ఉంది. ఆ సమయంలో అతడి తల్లి టీ తయారు చేస్తుండగా, అతను అక్కడే ఉన్న చెట్టుకింద పడుకుని ఉన్నాడు. హఠాత్తుగా ఒక భారీ విమాన శకలం అతని తలపై పడింది. వెంటనే అతను మంటల్లో చిక్కుకున్నాడు. అతడిని రక్షించడానికి ప్రయత్నించినా వీలుకాలేదు. అతని మృతదేహం గుర్తుపట్టలేని విధంగా మాడిపోవడంతో మృతదేహాన్ని గుర్తించేందుకు సివిల్ దవాఖాన అధికారులు ఆకాశ్ తండ్రి డీఎన్ఏ శాంపిల్స్ తీసుకున్నారు.



### పెళ్లయిన రెండు రోజులకే నవ వరుడు మృతి

పెళ్లయిన రెండు రోజులకే నవ వరుడిని విమాన ప్రమాదం పొట్టన పెట్టుకుంది. లండన్‌లోనే చదువుకుని అక్కడే ఉద్యోగం చేస్తున్న భవిక్ మహేశ్వరి (26) సెలవులపై రెండు వారాల క్రితం వడోదర వచ్చాడు. భవిక్‌కు ఈ నెల 10న రిజిస్ట్రార్ వివాహం జరిపించారు. ఈసారి భారత్ వచ్చినప్పుడు వివాహ ఫంక్షన్ చేద్దామని ఇరు కుటుంబాలు నిర్ణయించాయి. సెలవులు అయిపోవడంతో లండన్‌కు గురువారం బయలుదేరిన భవిక్‌కు ఆయన భార్య కూడా అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చి వీడ్కోలు చెప్పింది. ఆమె ఇంటికి చేరకముందే పెను విషాద వార్త చేరడంతో కుప్పకూలిపోయింది. గురువారం మధ్యాహ్నం ఒంటిగంటకు తన కుమారుడు ఆఖరి సారి తనతో మాట్లాడాడని ఆయన తండ్రి అర్జున్ మహేశ్వరి తెలిపారు.



# ఆ ఇద్దరి జాడేది?

## 24 గంటలు దాటినా నా తల్లి, బిడ్డ కనిపించడం లేదు..

**బీజే మెడికల్ కాలేజీ మెస్ వర్కర్ ఆవేదన • విమానం కూలిన ఘటనలో అదృశ్యమైనట్టు వెల్లడి**

అహ్మదాబాద్: గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ఉన్న సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి గురువారం లండన్ బయల్దేరిన విమానం కాసేపటికే కుప్పకూలి 265 మందికి పైగా మృతిచెందారు. ఇంకా దేశం ఆ విషాదం నుంచి తేరుకోలేదు. ఈ ఘటన జరిగి 24 గంటలు దాటినా ఈ ప్రమాదంలో తన తల్లి, బిడ్డ జాడ కనిపించకుండా పోయిందని ఓ వ్యక్తి శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశాడు. విమానం కూలిన బీజే మెడికల్ కాలేజీలో రవి ఠాకూర్, తన తల్లి, భార్యతో కలిసి పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సీనియర్ డాక్టర్ల కోసం మెస్ నుంచి దవాఖానకు తన భార్యతో కలిసి భోజనం తీసుకెళ్లినట్టు తెలిపాడు. తన తల్లి సరళతో పాటు బిడ్డ ఆద్య ఉన్నారని చెప్పాడు. అదే సమయంలో విమానం కూలిందని పేర్కొన్నాడు. ఘటన జరిగి 24 గంటలు గడిచిందని, మృతి చెందిన, గాయపడిన మెడికోలందరినీ గుర్తించారని తన వారి జాడ మాత్రం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. వారి అచూకీ కోసం ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానలన్నీ వెతికినట్టు చెప్పాడు. మెస్‌లోకి అనుమతించడం లేదని, వారంతా గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్నట్టు తమకు అనుమానంగా ఉందని తెలిపాడు. తమను లోనికి అనుమతించాలని వేడుకున్నాడు. అక్కడ పని చేస్తున్న మరో వంటమనిషి మీనా మిస్త్రీ మాట్లాడుతూ 'విమానం కూలిన సమయంలో మెడికోల కోసం రోటీలు చేస్తున్నాం.. మొదట గ్యాస్ సిలిండర్ పేలిందని అనుకున్నాం.. కాసేపట్లోనే ఇదేదో పెద్ద ప్రమాదమని గుర్తించాం.. అంతా చీకటి కమ్ముకుంది.. మా ఫోన్లు, కీలు ఎక్కడ ఉన్నాయో కూడా తెలువదు.. నా స్కూటీ ధ్వంసమైంది' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మరో వంటమనిషి నీమా బెన్ నిగమ్ మాట్లాడుతూ తాము ఇక్కడ 30 ఏండ్లుగా పనిచేస్తున్నామని, పెద్ద శబ్దం విని బయటకు పరుగులు తీసినట్టు తెలిపింది.